# తృప్తి



ఆ అబ్బాయికి మా ఇంటిముందున్న గది అద్దెకిచ్చి ఇప్పుడు చాలా బాధ పడుతున్నాను.

కారణం... అతని కోసం వచ్చే స్నేహితులు, ఎప్పుడూ మ్రోగుతుండే టెలిఫోన్, సిగరెట్ల వాసన!

నేనూ, నా భార్య వయసు మళ్లినవాళ్ళం కనుక కాస్త మనిషి సాయం ఉంటుందని అతనికి అద్దెకిచ్చాను. అది ఖాళీగా ఉంచేసివుంటేనే బాగుండేదనిపిస్తోంది ఇప్పుడు.

ఆ రాత్రి ఏడు గంటలకు అతను నాతో అన్నాడు-

"అంకుల్! నేను రేపు మా ఊరెళ్లిపోతున్నాను. టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు రేపు ఫోన్ తీసుకెళ్తారు. నేను నా సామానంతా తీసుకెళ్తున్నాను. రేపు ఉదయం నాలుగున్నరకు ట్రైన్. రూమ్ కీ గూటిలో పెట్టి వెళ్తాను... మిమ్మల్ని లేపి ఇబ్బంది పెట్టకుండా."

రూమ్ ఖాళీ అవుతున్న ఆనందంతో నిద్రపట్టక బయటికి వచ్చాను.

పదిన్నర అయివుంటుంది... అతని గది నుండి మాటలు వినిపిస్తే ఆగిపోయాను.

ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు...

"రేపు ఉదయం నాలుగు గంటలకు పులోమజ స్టేషన్ కొస్తుంది. ఇద్దరం హైదరాబాద్ వెళ్లి వారంరోజులు జల్సా చేస్తాం. తర్వాత నేను- అది నిద్రపోతున్నప్పుడు మా ఊరికి తిన్నగా చెక్కేస్తాను. తనే ఎం.బి.ఏ. చదివిందనీ, చాలా తెలివిగలదాన్ననీ దాని పొగరు! నేను దాన్ని బోల్తా కొట్టించానని తెలిస్తే... అప్పుడు కుదుర్తుంది దాని తిక్క, తల పొగరు!"

గబగబా లోపలికొచ్చేశాను. పులోమజ... ఎక్కడో విన్న పేరు! నా ముసలి బుఱ్ఱకు తోచక నా భార్యను నిద్రలేపాను.

"అర్ధరాత్రి ఇదేం ప్రశ్నండీ..!" అని విసుక్కున్నా తర్వాత చెప్పింది.

పులోమజ మా వెనుక వీధిలో వున్న రాఘవయ్య, సుగుణల అమ్మాయి. ఎం.బి.ఏ. చదివింది. ఏదో ఇంటర్వ్యూకై రేపు హైదరాబాద్ వెళ్తోంది.

ఆ ఇంటర్వ్యూ నామమాత్రమేనని నాకు అర్థమైంది. ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. ఉదయాన్నే నాలుగు గంటలకల్లా పులోమజ ఇల్లు చేరాను. ఆశ్చర్యంగా చూసిన రాఘవయ్యతో- "నేను పది గంటల బండికి హైదరాబాద్ వెళ్తున్నాను. పులోమజను నాతో తీసుకెళ్తాను" అన్నాను.

కూతురికి ప్రయాణంలో తోడు దొరికినందుకు ఆయన సంతోషించాడు. పులోమజ ఏదో చెప్పబోతే ఆయన పట్టించుకోలేదు. తర్వాత పులోమజ ఒంటరిగా దొరికిన తర్వాత ఆమె ప్రియుడి అసలు రూపం గురించి చెప్పాను. ఆమె ముఖం పాలిపోయింది. తర్వాత వెక్కివెక్కి ఏడవసాగింది.

"ఇంక ఏడవవలసిన అవసరం లేదమ్మా! ఆపద తప్పిపోయింది. వాడు ఇక మళ్లీ ఈ ఊరికి రాడు. నేను వెళ్లొస్తాను. మీ నాన్నకు ఏదో ఒక కారణం చెప్పి హైదరాబాద్ ట్రిప్ కాన్సిల్ చేయి."

ఆమెను ఓదార్చి ఇంటికి బయలుదేరాను.

ఆ అబ్బాయికి మా గది అద్దెకిచ్చినందువల్లే ఓ ఆడపిల్ల జీవితాన్ని కాపాడగలిగానన్న నిజం నాకు తృప్తి నిచ్చింది.

●

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 29 మార్చి' 2001